యాదగిరీశుడికి నిత్యోత్సవాలు

సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 13 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గురువారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తరనామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామివారికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాల పేరిట సంకల్పం చేశారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామి వారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు కొనసాగాయి.

సుమారు 10వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.23,89,661 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ఎర్రవెల్లి ఫాంహౌజ్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో బీఆర్ఎస్వీ మండల నాయకులు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్‌వీ నాయకులు

యాదగిరిగుట్ట, జూన్ 13 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆ పార్టీ విద్యార్థి విభాగం యాదగిరిగుట్ట మండల నాయకులు గురువారం ఎర్రవరం వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు ఒగ్గు మల్లేశ్, నాయకులు కర్రె లింగం, ఒగ్గు శ్రీకాంత్, గవ్వల నవీన్ పాల్గొన్నారు.

'విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేశ్

ఆత్మకూరు(ఎం), జూన్ 13 : ప్రారంభ దశలోనే అన్ని పాఠశాలల్లో విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందజేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లను శుభ్రపరిచి మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, ప్రతి పాఠశాలలో స్వీపర్, అటెండర్లను నియమించాలని కోరారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో 20శాతం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రవేశం కల్పించాలన్నారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంపల్లి వెంకట్, మండల కన్వీనర్ కదిరె నవీన్, నాయకులు అనిల్, రామచంద్రు, శ్రీధర్, మధు, స్వామి పాల్గొన్నారు.

చైర్మన్ మల్లేశ్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ రాంప్రసాద్

కాశీ అన్నపూర్ణ పాలసంఘం చైర్మన్‌గా మల్లేశ్

ఆలేరు రూరల్, జూన్ 13 : కాశీ అన్నపూర్ణ పాల సంఘం నూతన కమిటీని మండలంలోని రాఘవాపురం గ్రామంలో గురువారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బండ మల్లేశ్, డైరెక్టర్లుగా గవ్వల సిద్దమ్మ, కరికె మల్లేశం, మల్లూరి కనకరాజు, కొడారి శ్రీను ఎన్నికయ్యారు. అనంతరం చైర్మన్‌ను మాజీ సర్పంచ్ బక్క రాంప్రసాద్ సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు పరిదె సంతోష్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కరికె మల్లేశ్ పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడికి రిమాండ్

మోత్కూరు, జూన్ 13 : మోత్కూరు మున్సిపాలిటీలోని పెద్ద చెరువు కింద ముత్యాలమ్మ వ్యవసాయ బావిలోకి మాటూరి కవిత (38)ను నెట్టివేసి హత్యకు కారణమైన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. భువనగిరి పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల కాకినాడ కాలనీలో నివాసం ఉంటున్న మాటూరి కవితకు భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిపల్లికి చెందిన మాకోళ్ల నర్సింహులుతో వ్యవసాయ పొలం వద్ద కూలి పనులకు వెళ్లిన సందర్భంలో పరిచయమైంది. అది కాస్త వివాహేతర సంబంధంగా ఏర్పడింది.

ఈ క్రమంలో వారు బుధవారం మోత్కూరులో ఉండే కవిత బంధువైన కొంగరి మమత ఇంటికి వచ్చారు. స్నానం చేయడానికని వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా.. ఈత రాని కవితను బావిలోకి నెట్టి నర్సింహులు పరారయ్యాడు. నిందితుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

రాజాపేట, జూన్ 13 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన పాముకుంట జడ్పీ పాఠశాల విద్యార్థులు జశ్వంత్, కావ్య, భాగ్యకు గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి రాపోలు జగన్‌మోహన్‌రెడ్డి నగదు ప్రోత్సాహకం అందజేశారు. ముగ్గురికి రూ.17వేలు ఇవ్వగా.. ఎంపీటీసీ ఎడ్ల నరేశ్‌రెడ్డి విద్యార్థులకు గురువారం అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నగదు అందజేస్తున్న ఎంపీటీసీ నరేశ్‌రెడ్డి

మోత్కూరు రోడ్డు పనులు త్వరగా చేపట్టాలి

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

మున్సిపాలిటీ సాధారణ సమావేశంలో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, జూన్ 13 : మోత్కూరు మున్సిపాలిటీ ప్రధాన రోడ్డు విస్తరణతో గుంతలు పడి అధ్వాన్నంగా మారిందని, రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత అధ్యక్షతన గురువారం జరిగిన మున్సిపాలిటీ పాలకవర్గ సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అభివృద్ధిపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇండ్లను త్వరగా తొలగించుకోవడం కోసం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌ను ఆదేశించారు. అలసత్వం ప్రదర్శించే వారిపై మున్సిపల్ యాక్టు ప్రకారం చర్యలు తీసుకొని తొలగించాలన్నారు. ఒకరిద్దరు తొలగించుకోకపోవడం వల్ల రోడ్డు పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. వాన పడితే రోడ్డుపై ఉన్న గుంతలతో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్రధాన రోడ్డుపై ఎస్‌బీఐ వద్ద, అరుణోదయ సమీపంలో ఉన్న కల్వర్టు పనులను చేపట్టాలని సూచించారు. లేకుంటే కాంట్రాక్టులను రద్దు చేసి ఇతరులకు ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వీధిలో పారిశుధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. పారిశుధ్యంపై మున్సిపల్ వార్డు ప్రత్యేకాధికారులు రోజూ పర్యవేక్షణ చేయాలన్నారు. మున్సిపాలిటీకి ఇటీవల మంజూరైన రూ.10కోట్లకు సంబంధించిన పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం మున్సిపాలిటీకి రెండు స్వచ్ఛ ఆటోలు, ఒక ట్రాలీ ట్రాక్టర్ కొనుగోలు చేయాలని పాలకవర్గం తీర్మానం చేసింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, పబ్లిక్ హెల్త్ ఎస్సీ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఈ మనోహరి, తాసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏడీఈ బాలూనాయక్, ఏఈలు సురేశ్, శ్రీకాంత్, హుస్సేన్ పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

మన్నపేట, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల కేంద్రంతోపాటు దుబ్బాక గ్రామంలో గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఈ సంవత్సరం నుంచి ఉద్దీపన కార్యక్రమం ప్రారంభిస్తామని, వంద మంది పిల్లలు ఉన్న పాఠశాలలో ఇద్దరు వలంటీర్లను నియమిస్తామని చెప్పారు. అనంతరం బోగారం గ్రామంలో బొడ్రాయి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూస బాలమణి, జడ్పీటీసీ పున్న లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, ఎంఈఓ శ్రీధర్, ఎంపీటీసీలు మడూరి జ్యోతి, ఎండీ రేహాన్, వనం హర్షిణి, నాయకులు సురిగిరెడ్డి మల్లారెడ్డి, గంగుల రాజిరెడ్డి, కూసూరు సాయికుమార్, అక్రం పాల్గొన్నారు.

ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఆర్థిక అక్షరాస్యత కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ అంబిక

రంగాపూర్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న అంబిక

బొమ్మలరామారం, జూన్ 13 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం యాదాద్రి, మేడ్చల్ జిల్లాల కో ఆర్డినేటర్ అంబిక అన్నారు. మండలోని రంగాపురం, పెద్దపర్వతాపురం గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలకు కీసర సీఎఫ్ఎస్ సెంటర్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను బ్యాంకుల ద్వారా లబ్ధి పొందాలన్నారు. సైబర్ మోసగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష యోజన, జీవన జ్యోతి, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందరూ తప్పకుండా బ్యాంకు ఖాతా కలిగి ఉండి పొదుపు ప్రయోజనాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ విశ్వనాథ్, సీఎఫ్ఎల్ భానుశ్రీ పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో భారీ వర్షం

యాదగిరిగుట్ట, జూన్ 13 : యాదగిరిగుట్ట పట్టణంతోపాటు పలు గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన వర్షానికి రాకపోకలకు అంతరాయం కలిగింది. కొండపైన స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు. పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం వాటిల్లింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మోత్కూరు, జూన్ 13 : మున్సిపాలిటీలోని సాయిబాబా నగర్ కాలనీ, అంబేద్కర్ చౌరస్తా నుంచి ఇందిరానగర్ కాలనీ వరకు పట్టణ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కాలనీల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల సాంకేతిక లోపాలను గుర్తించి మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 9నుంచి 11 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు, పట్టణవాసులు సహకరించాలని కోరారు.

కొత్త ప్రధానోపాధ్యాయులు వచ్చేశారు..

ఆత్మకూరు(ఎం) ఉన్నత పాఠశాల హెచ్ఎంగా బాధ్యతలు చేపడుతున్న మహదేవరెడ్డి

ఆత్మకూరు(ఎం), జూన్ 13 : ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలలకు కొత్త ప్రధానోపాధ్యాయులు వచ్చారు. వారు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆత్మకూరు(ఎం) ఉన్నత పాఠశాల హెచ్ఎంగా కొత్త మహదేవరెడ్డి, పల్లెర్ల పాఠశాలకు శ్రీనివాస్ రావు, కూరెళ్లకు దామోదర్, కొరటికల్‌కు వెంకట్‌రెడ్డి, పారుపల్లికి వెంకటరమణ, కప్రాయపల్లి పాఠశాలకు రత్నామాల హెచ్ఎంలుగా విధుల్లో చేరారు.

టంగుటూరు జడ్పీ పాఠశాల హెచ్ఎంగా రమాదేవి

ఆలేరు రూరల్ : మండలంలోని టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా కోడం రమాదేవి నియమితులయ్యారు. ఆలేరు పట్టణానికి చెందిన రమాదేవి ఇప్పటి వరకు రాజాపేట మండలం రఘునాథపురం జడ్పీ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎంగా విధులు నిర్వహించారు.

పట్టా భూమిలో నాటిన విద్యుత్ స్తంభాలను తొలగించాలి

పల్లెపహాడ్‌లో భూమి మధ్యలో నుంచి నాటిన విద్యుత్ స్తంభాలు

ఆత్మకూరు(ఎం), జూన్ 13 : తమ పట్టా భూమిలో అనుమతి లేకుండా విద్యుత్ అధికారులు దౌర్జన్యంగా నాటిన స్తంభాలను తొలగించాలని మండలంలోని పల్లెపహాడ్‌కు చెందిన సుబ్బూరి అశోక్, ప్రశాంత్ అన్నారు. బాధిత రైతులు గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ స్తంభాలను గెట్టు వెంట నాటాలని విద్యుత్ అధికారులు, సిబ్బందికి సూచించినా వినకుండా ఇష్టానుసారంగా చేను మధ్యలోంచి నాటారని, వాటికి మెయిన్ విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమిలో కోళ్ల ఫారం ఏర్పాటు చేద్దామనుకున్నామని, విద్యుత్ స్తంభాలు అడ్డు రావడంతో నిర్మాణం చేయలేకపోతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి భూమి మధ్యలో నాటిన స్తంభాలను తొలగించి గెట్టు వెంట ఏర్పాటు చేయాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి దగ్ధం

బొమ్మలరామారం, జూన్ 13 : మండలంలోని తిమ్మాపూరంలో పెండెం సాధన ఇంట్లో గురువారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ అయ్యి ఎలక్ట్రిక్ పరికరాలు, సామగ్రి దగ్ధమయ్యాయి. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. నిరుపేదలైన బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని మాజీ సర్పంచ్ పల్లె ఇందిర కోరారు.

బిక్కేరు వాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యాం

చకచకా చెక్‌డ్యాం నిర్మాణ పనులు

ఆత్మకూరు(ఎం), జూన్ 13 : మండలంలోని కొరటికల్ – ఆత్మకూరు(ఎం) గ్రామాల మధ్య బిక్కేరు వాగుపై చెక్‌డ్యాం నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4కోట్లు మంజూరు చేసింది. చెక్‌డ్యాం నిర్మాణ పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఇది పూర్తయితే భూగర్భ జలాలు పెరిగి పలు గ్రామాల్లోని బోరు బావులు పుష్కలంగా పోయనున్నాయి. దాంతో రైతులకు ఎంతగానో ఉపయోగపడనుంది.

రోడ్డుపై ప్రమాదకరంగా రేకులు

● రాత్రి పూట కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం
● తొలగించాలని కోరుతున్న స్థానికులు, ప్రయాణికులు

మూల మలుపు వద్ద ప్రమాదకరంగా రోడ్డు వైపునకు పడి ఉన్న రేకులు

గుండాల, జూన్ 13 : మండలంలోని అనంతారం గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద రేకులు రోడ్డు వైపునకు ప్రమాదకరంగా పడి ఉన్నాయి. రైస్ మిల్లుకు చెందిన రేకులు ఇటీవల ఈదురుగాలులకు రోడ్డుపైకి వాలిపోయాయి. మూలమలుపు కావడంతో వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. రాత్రి పూట ప్రయాణించే వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్నది. సంబంధిత అధికారులు స్పందించి రైస్ మిల్లు యజమానితో మాట్లాడి రేకులను తొలగించాలని గ్రామస్తులు, స్థానికులు కోరుతున్నారు.

డీసీఓ ప్రవీణ్‌కుమార్ నుంచి ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వెంకటేశ్వర్లు

ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు ఏకగ్రీవం

మోత్కూరు, జూన్ 13 : మోత్కూరు నాగార్జున రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌గా పేలపుడి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం కార్యాలయంలో డీసీఓ సమక్షంలో గురువారం ఎన్నిక నిర్వహించారు. పేలపుడి వెంకటేశ్వర్లు పేరును డైరెక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి ప్రతిపాదించగా.. మరో డైరెక్టర్ తాళ్లపెల్లి స్వామి బలపరిచారు. పోటీలో ఎవరూ లేకపోవడంతో సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్లు బయ్యని చంద్రశేఖర్, ఆకుల వెంకటేశ్వర్లు, జిట్ట లక్ష్మయ్య, కారుపోతుల ముత్తయ్య, బుషిపాక సుజాత, బండ పద్మ చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో వెంకటేశ్వర్లు ఎన్నిక ఏకగ్రీవమైనట్లు డీసీఓ పి.ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. వైస్ చైర్మన్‌ను వారం రోజుల్లో నోటిఫికేషన్ ద్వారా ఎన్నిక చేయనున్నట్లు తెలిపారు. కాగా, చైర్మన్‌గా ఎన్నికైన వెంకటేశ్వర్లు కార్యాలయంలోని చాంబర్‌లో వెంటనే బాధ్యతలను స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్, సంఘం సీఈఓ కొణతం వరలక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్‌ప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

'పుస్తకాలు అమ్ముతున్న స్కూళ్ల గుర్తింపును రద్దు చేయాలి'

భువనగిరి కలెక్టరేట్, జూన్ 13 : ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజు వసూళ్లను నిరోధించి, నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ కార్యాలయ ఏఓ జగన్ మోహన్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా వివిధ పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, పాఠ్య పుస్తకాలు, ఇతర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నాయని అన్నారు. చట్ట విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలపై ప్రత్యేక నిఘా పెట్టి వసూళ్లకు పాల్పడిన స్కూళ్ల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సురుపంగ చందు, జిల్లా కార్యదర్శి ఎండీ మసూద్, నాయకులు వినయ్, ఉపేందర్‌గౌడ్, అసద్, కార్తీక్ ఉన్నారు.

ఎన్నికైన కూరగాయల మార్కెట్ నూతన కమిటీ సభ్యులు

శ్రీరామ కూరగాయల మార్కెట్ నూతన కమిటీ

చౌటుప్పల్, జూన్ 13 : పట్టణంలోని శ్రీరామ కూరగాయల మార్కెట్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేప రాజు, ఉపాధ్యక్షులుగా పిల్లలమర్రి జగదీశ్, బొబ్బిళ్ల కాలేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా షేక్ మునీర్ పాషా (బాబు), కార్యదర్శిగా యాట రాజు, కోశాధికారిగా అబ్దుల్ రశీద్, సాంస్కృతిక కార్యదర్శిగా పాశం వెంకటేశ్, ప్రచార కార్యదర్శిగా కొడాలి దిలీప్‌కుమార్ ఎన్నికయ్యారు.

వీరితో పాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న భూపాల్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, జులై 13 : ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బొక్క భూపాల్ రెడ్డి 80 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా మండలంలోని ఇంద్రియాల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం భోజనం ప్లేట్లు, గ్లాసులు, కుల వృత్తుల వారికి బకెట్లు పంపిణీ చేశారు. ఈ సంవత్సర కాలంలో సుమారు 16 లక్షల రూపాయల విలువైన వస్తువులను పేదలకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నోముల మాధవరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పెద్దిరెడ్డి యాదగిరి, నాయకులు శెట్టి సురేశ్, రాజశేఖర్, వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.